స్థలాలిచ్చినా 'డబుల్' ఇళ్లు ఇవ్వలేదు

- నిర్మాణం పూర్తయినా 100 మందికే కేటాయింపు
- ఇల్లు రాని లబ్ధిదారుల ఆవేదన



కమలానగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు

యూసుఫ్‌గూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూలీనాలి చేసుకుని, కలోగంజి తాగి చిన్న ఇంటిలో ఉండే వాళ్లం.. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామంటే ఇళ్లు ఖాళీ చేశాం. సంవత్సరాల నుంచి అద్దె కడుతూ ఇబ్బంది పడుతున్నాం. ఏడాదిలో కడతామని చెప్పి ఆరేళ్లు కట్టారు. కొందరికి మాత్రమే ఇళ్లు ఇచ్చారు. మిగతా వారికి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని రహ్మత్‌నగర్ డివిజన్‌లోని కమలానగర్ లబ్ధిదారులు వాపోయారు.

కమలానగర్‌లో అందరూ పేదలు. కూలిపనులు చేసుకుని జీవిస్తున్నారు. డబుల్ ఇళ్లు కట్టిస్తామంటే బస్తీలో ఉన్న 146 మంది స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేశారు. స్థానికులు ఇచ్చిన స్థలంలో 2017లో 210 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి 2023లో పూర్తి చేశారు. అదే ఏడాది మే 18న వంద మందికి ఇళ్లు కేటాయించారు. మిగతా వారికి తర్వాత కేటాయిస్తామన్నారు. ఏడాదైనా ఇప్పటి వరకూ ఇళ్లు కేటాయించలేదు. నాయకులు, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలు అయిన తర్వాత కేటాయిస్తామనారు. లోక్‌సభ ఎన్నికల పేరుతో జాప్యం చేశారు. ఎన్నికలు అయిపోయినా ఇప్పటి వరకు మిగతా వారికి ఇళ్లు కేటాయించలేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించకపోవడంతో అద్దెలు కట్టలేకపోతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డబుల్ ఇళ్ల సముదాయంలో చెత్తాచెదారం

చెత్తాచెదారం

అందరికీ ఇళ్లు కేటాయించకపోవడంతో లిఫ్టులు వాడడం లేదు. దీంతో కొన్నిళ్లలో నివసిస్తున్న వారు మెట్లు ఎక్కి దిగాల్సి రావడంతో వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. 110 ఇళ్లు ఖాళీగా ఉండడంతో నిర్వహణ లేక చెత్తాచెదారం పేరుకుపోతోంది.

అద్దె కట్టలేకపోతున్నాం



ఏడేళ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నాం. అద్దె కట్టలేకపోతున్నాం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయినా కొందరికి మాత్రమే ఇచ్చారు. తమకు ఇళ్లు కేటాయించాలి.

- బి. మైసమ్మ, లబ్ధిదారురాలు

ఎన్నాళ్లీ కష్టాలు



మాకు ఎన్నాళ్లీ కష్టాలు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎందుకు కేటాయించడం లేదో తెలియడం లేదు. అద్దె కట్టలేకపోతున్నాం. ఇళ్ల స్థలం తీసుకొని ఇబ్బంది పెడుతున్నారు. ఇళ్లు కేటాయిస్తే అద్దెల బారం తగ్గుతుంది.

- ఎస్‌కే హసీనా, లబ్ధిదారురాలు





స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

యూసుఫ్‌గూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సమస్యలు తెలుసుకునేందుకు రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ఇందిరానగర్‌లో మంగళవారం పర్యటించారు. దెబ్బతిన్న రోడ్లు, తాగునీటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వణీధర్, స్థానిక నాయకులు అనంతన్న, ముంతాజ్ పాల్గొన్నారు. టీ. అంజయ్య బస్తీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాయకురాలు ఆండాళమ్మ కార్పొరేటర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆయుష్ విభాగం అభివృద్ధికి కృషి

- డిప్యూటీ డైరెక్టర్ స్వరూపరాణి

ఎర్రగడ్డ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ విభాగం అభివృద్ధికి కృషి చేస్తానని డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.స్వరూపరాణి అన్నారు. ఎర్రగడ్డలో ఆయుర్వేద ఆస్పత్రికి మంగళవారం వచ్చిన ఆమెను మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఆయుర్వేద ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు.



మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

పంజాగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్, కురుమ యువ చైతన్య సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేందర్ డిమాండ్ చేశారు. కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య దగ్గర నుంచి కొనపురి సాంబశివుడు, రాములుతో సహా అనేక మంది తెలంగాణ కోసం త్యాగం చేశారని అన్నారు. జనాభాలో 12 శాతం ఉన్న తమ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పి తమవద్ద డబ్బులు కట్టించుకుని మోసం చేసిందని ఆరోపించారు. సమావేశంలో సమితి రాష్ట్ర నాయకులు దొడ్డి శ్రీనాథ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీశైలం, నాయకులు బీర్ల శ్రీనివాస్, కె. కృష్ణ, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'త్యాగనిరతిని చాటడమే బక్రీద్ ఉద్దేశం'

బోరబండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగ నిరతిని చాటడమే బక్రీద్ ముఖ్య ఉద్దేశమని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాసుల మహేష్‌గౌడ్, నరసింహ, ఖయ్యూం, రాజశేఖర్ రెడ్డి, దేవేందర్, లఖన్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ

యూసుఫ్‌గూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో రెండు ల్యాప్‌టాప్‌లు చోరీ అయ్యాయి. బి. హరలాల్ నాయక్ బేగంపేటలో ఓ సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ వెంగళరావునగర్‌లోగల హ్యాపీ బాయ్స్ హాస్టల్‌లో 104 రూమ్‌లో ఉంటున్నాడు. హైటెక్ సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పి. వంశీకృష్ణ కూడా అదే రూమ్‌లో ఉంటున్నాడు. ఈనెల 17వ తేదీ ఉదయం ఇద్దరి ల్యాప్‌టాప్‌లు కపించలేదు.

విషయం హాస్టల్ నిర్వాహకులకు చెప్పగా.. సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి ఉదయం 6.40 గంటలకు హాస్టల్‌లో వారి రూమ్‌లోకి వెళ్లి ల్యాప్‌టాప్‌లు తీసుకొని వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



యోగా వాక్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

- అవగాహన వాక్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ

ఖైరతాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పూర్వీకులు మనకు అందించిన గొప్ప చారిత్రక సంపదైన యోగాను ప్రపంచానికి వరంలా ఇచ్చామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ రాష్ట్ర ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21న యోగా దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలలతో పాటు అన్ని చోట్లా నిర్వహించాలని పిలుపునిస్తూ మంగళవారం పీవీ నర్సింహారావు మార్గ్‌లో వాక్ నిర్వహించారు.

వాక్‌లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని, యోగా దినోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా సాధన వల్ల శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఆరోగ్య సమతుల్యత ఏర్పడుతుందన్నారు. ఆయుష్ విభాగం కమిషనర్ ప్రశాంతి, డైరెక్టర్ పాణి కిరణ్, హోమియోపతి, నేచురోపతి విద్యార్థులు పాల్గొన్నారు.



బాబుల్‌రెడ్డినగర్‌లో పర్యటిస్తున్న డీసీ ప్రశాంతి, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

వర్షంతో దెబ్బతిన్న రోడ్లను తిరిగి నిర్మిస్తాం : డీసీ

బంజారాహిల్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా దెబ్బతిన్న రోడ్లను త్వరలో తిరిగి నిర్మిస్తామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి అన్నారు. మంగళవారం ఫిలింనగర్ బండారు బాల్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి ఆమె పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వరద ధాటికి కూలిన పెద్దమ్మ దేవాలయం ప్రహరీని సందర్శించారు. పాడైన రోడ్డును పరిశీలించారు.

అనంతరం మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుండటంతో బస్తీలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ.. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.



ఖైరతాబాద్ ఓల్డ్ సీబీఐ క్వార్టర్‌లో మున్సిపల్ మైదానంలో హైమాస్ట్ లైట్ల పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

మున్సిపల్ మైదానంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులు

ఖైరతాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ మున్సిపల్ మైదానంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులు విరజిమ్మనున్నాయి. ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లోని ఈ మైదానంలో కార్పొరేటర్ విజయారెడ్డి ప్రతిపాదన మేరకు రూ. 4.38 లక్షల ఖర్చుతో మైదానం చుట్టూ 16 ఫ్లడ్ లైట్లను ఏర్పాటుచేసే పనులను విజయారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ గ్రౌండ్‌లో వేసవి శిక్షణా శిబిరాలతో పాటు ప్రతిరోజూ పిల్లలు, పెద్దలు వ్యాయామం చేస్తుండడంతోపాటు స్థానికులు చిన్నపాటి శుభకార్యాలు చేసుకుంటుంటారు. కార్యక్రమంలో బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ అనిల్‌కుమార్, ప్రతినిధులు కిషోర్‌కుమార్, రాజేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించడం గొప్ప సంస్కారం

- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గురుపరంపరకు భారతీయ సంస్కృతిలో ప్రాధాన్యం ఉందని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. కళను నేర్చుకున్న శిష్యులు వారి గురువులను గౌరవించడం, గురువులు వారి గురువులను గుర్తుచేసుకోవడం గొప్ప సంస్కారమని ఆమె పేర్కొన్నారు. భారత చూడామణి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువు నెమలికంటి సువర్ణలత తన గురువులు పద్మశ్రీ అడయార్ కె. లక్ష్మణ్, వేదాంతం జగన్నాథశర్మ సంస్మరణ సభ త్యాగరాయగానసభలో మంగళవారం నిర్వహించారు. ఆమె శిష్య బృందం కూచిపూడి నాట్యప్రదర్శనను అద్భుతంగా చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాణీదేవి మాట్లాడుతూ.. సువర్ణలత ఐదు దశాబ్దాలుగా కూచిపూడి నాట్యంలో వందలమందికి శిక్షణ ఇచ్చి మంచి కళాకారులుగా తీర్చిదిద్దారని అభినందించారు. కర్ణాటక సంగీత నాట్య అకాడమీ పూర్వ ఛైర్మన్ వైజయంతి కాశీ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, ఏకాగ్రతకు నాట్యం సాధనం అన్నారు. ఆధ్యాత్మికవేత్త డా. అనంతలక్ష్మి నర్తకీమణులను అభినందించారు.

సమస్యలు తెలుసుకోరు..

ఫోన్ చేస్తే స్పందించరు

- ప్రభుత్వ అధికారుల తీరుపై కాలనీల వాసుల నిట్టూర్పు
- సమస్యల పై శంఖారావంలో తాగునీరు, డ్రైనేజీపై ఫిర్యాదుల వెల్లువ



కాలనీ వాసుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, జీహెచ్‌ఎంసీ డీసీ ఎస్లావత్ నాయక్ తదితరులు

బంజారాహిల్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మురుగునీరు రోడ్లను ముంచెత్తుతోంది.. తాగునీటి సరఫరా సరిగా ఉండదు.. సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో అర్థం కావడం లేదు.. ఫోన్ చేస్తే స్పందించేవారే కరువయ్యారంటూ కాలనీల వాసులు ప్రభుత్వాధికారుల తీరుపై నిట్టూర్చారు. అధికారుల మధ్య సమన్వయ లోపం తమకు శాపంగా మారుతోందని ఆరోపిస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ ప్రాంతాల ఇబ్బందులు తెలుసుకునేందుకు మంగళవారం కమలాపురి కాలనీ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో సమస్యలపై శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. తాగునీరు, రోడ్లపై మురుగునీరు ప్రవహించడంపై స్థానికులు పెద్దఎత్తున ఫిర్యాదులు చేశారు. నవోదయకాలనీ, ఎల్లారెడ్డిగూడ, ఇంజనీర్స్‌కాలనీ, ఎల్‌ఐసీ కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల తరుచూ డ్రైనేజీలు లీకవుతున్నాయని, పైపులైన్ సామర్థ్యం పెంచడం లేదా కొత్త పైపులైన్ వేయాలని విజ్ఞప్తి చేశారు. ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. పార్కు నిర్వహణ ఖర్చులను జీహెచ్‌ఎంసీ ఇవ్వడం లేదని ప్రగతినగర్ వాసులు చెప్పారు. తమ కాలనీలో పోలీస్ ఔట్‌పోస్టు ఉందని, గతంలో బంజారాహిల్స్ ఠాణా నుంచి ఇటీవల జూబ్లీహిల్స్‌కు మారిందన్నారు. బాధ్యతలు బదిలీ కాకపోవడంతో కాలనీలో సీసీ కెమెరాలు పెట్టుకున్నా వాటి మానిటరింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జలమండలి సిబ్బంది మీటర్ రీడింగ్ తీసుకోకుండా ఇష్టానుసారంగా బిల్లులు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కృష్ణానగర్‌లో లోప్రెషర్‌తో తాగునీరు సరఫరా అవుతోందని, కేవలం 45 నిమిషాలు మాత్రమే సరఫరా చేస్తున్నారని బస్తీవాసులు ఆరోపించారు. మారుతీనగర్‌లో రోడ్లు శిథిలావస్థకు చేరాయని ఫిర్యాదు చేశారు.

నిధుల కోసం ప్రతిపాదన

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. సమస్యలపై శంఖారావంలో వచ్చిన ఫిర్యాదులపై నివేదిక రూపొందించి నిధుల కోసం ప్రతిపాదన చేయనున్నట్లు తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు అధికారులతో 15 రోజులకొకసారి సమీక్షా సమావేశం, మిగతా డివిజన్‌లలో కూడా త్వరలో సమస్యలపై శంఖారావం నిర్వహిస్తామన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, జీహెచ్‌ఎంసీ డీసీ ఎస్లావత్‌నాయక్, ఏఈ భరత్‌కుమార్, జలమండలి మేనేజర్ శ్యాంకుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాణి, ట్రాన్స్‌కో ఏఈ నరేందర్, పలు కాలనీల సంక్షేమ సమితి నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల కొనుగోలు కేసు దర్యాప్తు ముమ్మరం

మరో ముగ్గురిని రక్షించిన పోలీసులు



చిన్నారిని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగిస్తున్న సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంచలనం సృష్టించిన చిన్నారుల కొనుగోలు కేసులో రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మరో ముగ్గురు చిన్నారులను రక్షించినట్లు సీపీ తరుణ్ జోషి మంగళవారం తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అయి విక్రయించబడిన 15 మంది చిన్నారులను ఇటీవల రాచకొండ పోలీసులు రక్షించి, నిందితులను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు రక్షించిన చిన్నారుల సంఖ్య 18కి చేరిందన్నారు. చిన్నారులను అక్రమ రవాణా చేయడంలో పూణె, ఢిల్లీ ముఠాల హస్తం ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో పూణె పోలీసులు 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిసింది. వీరికి నగరంలో దొరికిన ముఠాలతో లింకులపై పోలీసులు ఆరా తీయగా.. ఐదుగురు నిందితులకు సంబంధం ఉన్నట్లు తేలింది. వారిని పీటీ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చి విచారించి ఢిల్లీ ముఠాలతో ఉన్న లింకులపై సమాచారం రాబడతామని సీపీ తెలిపారు. ముఠాల గుట్టు వీడితే ఆ చిన్నారులను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? వారి తల్లిదండ్రులు ఎవరు అనేది తెలుస్తుందన్నారు.

స్తంభంపై పూలమొక్క



ఫిల్మ్‌నగర్ దైవసన్నిధానం ఎదుట ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభంపై మొలిచిన పూల మొక్క

జీహెచ్‌ఎంసీలో బదిలీల టెన్షన్

- జోరుగా చర్చలు
- అవినీతి అధికారులపై ప్రత్యేక నజర్?



ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం

ఖైరతాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో బదిలీలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి వరకు బదిలీలు ఉంటాయనే సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో తమను ఎక్కడకు బదిలీ చేస్తారోనన్న ఆలోచనలతో ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. సెలవులో వెళ్లిన కమిషనర్ వచ్చిన తర్వాత బదిలీలు ఉంటాయని పేర్కొంటుండగా, బదిలీల జాబితా సిద్ధమయిందని కొందరు, వెలువడడమే ఆలస్యమని మరికొందరు అంటున్నారు. విభాగాల వారీగా ఉద్యోగుల జాబితాలు, ఆయా స్థానాల్లో ఎన్ని సంవత్సరాలుగా ఉంటున్నారు, వారి ట్రాక్ రికార్డుల పరిశీలన జరిగిందని తెలుస్తోంది.

అవినీతి అధికారులకు చెక్ పడేనా?

ఖైరతాబాద్ జోన్‌లో అవినీతి అధికారుల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. బదిలీల్లో అధికారుల పనితీరు, వారి నిజాయితీ, అవినీతి విషయాలను పరిగణనలోకి తీసుకుంటారన్న సమాచారంతో ఏ లూప్‌లైన్‌లో వేస్తారో అనే అనుమానాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేశారు. ఖైరతాబాద్ జోన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి జోరుగా సాగుతోంది. ఓ ఏసీపీ స్థాయి అధికారి దీర్ఘకాలంగా పనిచేస్తూ అంతా తానై నడిపిస్తుండగా, ఉన్నతాధికారుల అండతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు బాహాటంగా విమర్శిస్తున్నారు. మొన్నటివరకు ఇక్కడ పనిచేసి ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా వివాదాస్పద కూల్చివేతలు చేపట్టారంటూ బదిలీ వేటుకు గురైన జోనల్ కమిషనర్ పేషీకి సందర్శకులతోపాటు జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ఎవరు వెళ్లాలన్నా ఫోన్లను బయట సరెండర్ చేసి వెళ్లాలనే నిబంధన ఉండేది. ఇక సర్కిళ్ల విషయానికి వస్తే.. సర్కిల్ 17 ఇంజనీరింగ్‌లో అవినీతి టెక్నికల్‌గా జరుగుతోంది.

ఈ సర్కిల్ మెడికల్ విభాగంలో వైద్యాధికారి అవినీతిపై జోనల్ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. కొందరు ఎస్‌ఎఫ్‌ఏలకు నిబంధనలకు విరుద్ధంగా 5 నుంచి 8 స్వీపింగ్ గ్రూపులు కేటాయించడం, కొందరితో అక్రమంగా వసూళ్లు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా స్థాయి లేని ఉద్యోగులతో చలానాలు రాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల ట్యాక్స్ సెక్షన్లలో టీఐలు, బీసీల చేతివాటం షరా మామూలుగానే నడుస్తోంది. ఎస్‌ఎఫ్‌ఏలను సైతం బదిలీ చేస్తారనే సమాచారం. ఎస్‌ఎఫ్‌ఏలు స్వీపింగ్ గ్రూపుల్లో అక్రమాలతోపాటు వైద్యాధికారులను ప్రసన్నం చేసుకొని ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ఎస్‌ఎఫ్‌ఏలు జంట సర్కిళ్లలో చలానాలు వేస్తామని భయపెడుతూ వసూళ్లకు పాల్పడుతుండగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాలతో మరి కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఖైరతాబాద్ జోన్‌లో ఏళ్లుగా తిష్ఠ

సాధారణంగా ఒకే ప్రాంతంలో 3 సంవత్సరాలుగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తారు. ప్రస్తుతం పది సంవత్సరాల అనంతరం ప్రభుత్వం మారడం, పాలనలో పట్టు సాధించేందుకు ప్రక్షాళన చేయాలని భావిస్తుండడంతో ఈసారి ఊహించని విధంగా పెద్ద ఎత్తున బదిలీలు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఖైరతాబాద్ జోన్ టౌన్ ప్లానింగ్‌లో ఓ ఏసీపీ స్థాయి అధికారితో పాటు జంట సర్కిళ్ల ఇంజనీరింగ్ విభాగంలో అధికారులు చాలా సంవత్సరాలుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. వైద్య విభాగాల్లో సూపరింటెండెంట్ స్థాయి అధికారులతో పాటు సెక్షన్ల అధికారులు చాలా రోజులుగా ఒకేచోట పనిచేస్తున్నారు. పన్నుల విభాగంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు అధికారుల అండదండలతో ఒకేచోట తిష్ఠవేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పని పరిస్థితుల్లో జోన్ పరిధిలో ఒక సర్కిల్ నుంచి పక్క సర్కిళ్లకు బదిలీ చేయించుకొని మధ్యలో తిరిగి పాత స్థానానికే వచ్చిన వారు ఉన్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో ఒక సర్కిల్ నుంచి మరో సర్కిల్‌కు బదిలీ అయిన సిబ్బంది చాలామంది ఉన్నారు. ఈసారి కంప్యూటర్ ఆపరేటర్లను సైతం బదిలీ చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. చాలా కాలంగా ఆయా సర్కిళ్లలో పనిచేస్తున్న ఆపరేటర్లను బదిలీ చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

మాయమవుతున్న సీసీ కెమెరాలు

- పెరిగిపోతున్న నేరాలు
- సికింద్రాబాద్‌లో రెచ్చిపోతున్న సెల్‌ఫోన్ దొంగలు
- కళ్లుమూసేలోపు దొంగలు మాయం



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో మొరాయించిన సీసీ కెమెరాలు

అడ్డగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య కేంద్రంగా పేరున్న సికింద్రాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దాదాపు రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చుట్టుపక్కల కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనికిరాకుండాపోతున్నాయి. ఐదేళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఈ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో తెలియకుండాపోతున్నాయి. ఈ కారణంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చుట్టుపక్కల, మోండా మార్కెట్, ఆల్ఫా హోటల్, క్లాక్‌టవర్, రేతిఫైల్ బస్టాండ్ వంటి ముఖ్యమైన కూడళ్ల వద్ద సెల్‌ఫోన్ దొంగలు పెరిగిపోతున్నారు. సీసీ కెమెరాలు లేని చోట్ల జల్సారాయుళ్లు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలో ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు సమయానికి రైళ్లు లేకపోవడంతో ఆ రాత్రి స్టేషన్ ఆవరణలో పడుకుని ఉన్న సమయంలో తోటి ప్రయాణికులుగా నటిస్తూ వారి జేబుల్లో ఉన్న సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లిపోతున్నారు. రాత్రి సమయంలో విచ్చలవిడిగా నేరాలు పెరిగిపోతున్నాయి. ఒక వైపు పోలీస్ పెట్రోలింగ్ చేస్తున్నప్పటికీ నేరాలు జరుగుతున్నాయి. నేరం జరిగినచోట సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు ఇట్టే తప్పించుకుంటున్నారు. ఆల్ఫా హోటల్ ఎదురుగా కొందరు పోకిరీలు రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు ఫుట్‌పాత్‌పై దుస్తులు షాపింగ్ చేస్తున్న సమయంలో నేరాలు జరుగుతున్నప్పటికీ పోలీస్‌స్టేషన్ ఎక్కడ ఉందో తెలియక బాధితులు రైల్వేస్టేషన్‌కు వెళ్లిపోతున్నారు. ఇలా చాలాసార్లు అనేక నేరాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

మోండా మార్కెట్‌లో విచ్చలవిడిగా నేరాలు

చిన్న చిన్న పండుగలు వస్తే చాలు మోండా మార్కెట్‌కు వేల మంది షాపింగ్ చేసేందుకు వస్తుంటారు. కూరగాయలు కొనుగోలు చేసే సమయంలో ప్రజలు రద్దీ ప్రాంతంలో తన జేబులో ఉన్న సెల్‌ఫోన్లను ఇట్టే ఎత్తుకుపోతున్నారు. మార్కెట్ పోలీస్‌స్టేషన్‌కు రోజుకు నాలుగు నుంచి ఐదు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిసింది. సెల్‌ఫోన్ బాధితులు పోలీస్ స్టేషన్‌కు వస్తే మీసేవకు వెళ్లి సీఐఆర్‌లో నమోదుచేసుకోవాలని చెబుతున్నారు. మీ సేవ కేంద్రం ఎక్కడుందో తెలియక బాధితులు ఇంటిదారిన పడుతున్నారు. మోండా మార్కెట్‌లో పోలీసులు పెట్రోలింగ్ చేయడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. మోండా మార్కెట్‌లో సీసీ కెమెరాల్లో కదలికల్ని పోలీసులు గమనించలేకపోతున్నారు. ఇప్పటికైనా పాడైపోయి ఉన్న సీసీ కెమెరాలు బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సత్కరిస్తున్న ఈఓ మహేందర్ రెడ్డి

ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసిన మహేందర్‌రెడ్డి

తిరుమలగిరి జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను లాల్‌బజార్ మహంకాళి దేవాలయం ఈఓ పి.మహేందర్‌రెడ్డి బుధవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. డౌటన్ బజార్‌లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వేద పండితుల ద్వారా స్వామివారి ఆశీస్సులు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రానున్న బోనాల జాతరకు శ్రీమహంకాళి దేవాలయానికి నిధులు పెద్ద ఎత్తున మంజూరు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. దేవాలయాల అభివృద్ధికి కూడా కృషి చేయాలని ఈ సందర్భంగా ఈఓ మహేందర్ రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో బొల్లారం డౌటన్‌బజార్ శ్రీహనుమాన్ దేవాలయానికి చెందిన అర్చకులు, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అడ్డగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాండు వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని 50ఏళ్ల వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో రోడ్డుపై పడి ఉండగా వైద్య పరీక్షల నిమిత్తం అతనిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి మరణించాడని పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే వెంటనే 8712660248 నెంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతు మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 9లో మంగళారం ఉదయం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని 45ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు వ్యక్తిని వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

బోనాల నిధుల కోసం దరఖాస్తు చేసుకోండి


చిలకలగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం బోనాల పండుగను పురస్కరించుకుని అమ్మవారి దేవాలయాలకి అందజేస్తున్న నిధుల కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయాల అలంకరణ అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం మాదిరిగానే నిధులు కేటాయిస్తుందని, గత సంవత్సరం నిధులు పొందిన ఆలయాల నిర్వాహకులు మాత్రమే అర్హులని, ఆలయం ఫోటో, లెటర్ హెడ్, అధ్యక్షుడు, కార్యదర్శి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, నిధుల వినియోగం యుటిలైజేషన్ సర్టిఫికెట్, రెండు రెవిన్యూ స్టాంపులు, గత సంవత్సరం పొందిన చెక్కు జిరాక్స్ కాపీ జతచేయాలని తెలిపారు. మెట్టుగూడ కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10గంటల నుంచి దరఖాస్తులు తీసుకొనవచ్చునని తెలిపారు.



చిలకలగూడలో అధ్వాన స్థితిలో ఉన్నరోడ్డు

చిలకలగూడలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

బౌద్ధనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో చిలకలగూడలో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ ఎం.సురేందర్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. మంగళవారం రోడ్లు అధ్వానంగా ఉన్నాయని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదుచేశారు. గుంతలు పడిన రోడ్లపై మురికినీరు పారుతుందని, దీంతో వాహనదారులు, పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొందని, దీంతోపాటు దోమలు వ్యాప్తిచెంది, దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధ్వానంగా ఉన్న రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.



మెట్టుగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు రాపోలు సురేష్ కుమారుడు రాహుల్ ఆకస్మికంగా మరణించడంతో ఆయన భౌతిక కాయాన్ని మంగళవారం సికింద్రాబాద్ శాసనసభ్యుడు పద్మారావుగౌడ్ సందర్శించి, మృతి పట్ల విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు.

- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి



అర్ధాంతరంగా నిలిపివేసిన నాలా పనులను స్థానిక ప్రజలతో కలిసి పరిశీలిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

ముందస్తు ప్రణాళిక లేకుండా పనులు ఎలా ప్రారంభిస్తారు? : ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మహేంద్ర హిల్స్ పక్కనే ఉన్న ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో కంటోన్మెంట్ బోర్డు నాలుగు నెలల క్రితం 40 లక్షల రూపాయల వ్యయంతో నాలా, సీసీ ర్యాంపు, నిర్మాణ పనులు చేపట్టారు. సగం మేర నాలా పనులు పూర్తయినప్పటికీ మిగతా పనులు పూర్తి కాకపోవడంతో స్థానిక ప్రజలు గత కొద్ది రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను "అసంపూర్తిగా నాలా నిర్మాణ పనులు" అనే శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించింది. స్పందించిన కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ నాలా పనులు నిలిపివేసిన ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. కంటోన్మెంట్ బోర్డు ఇంజనీర్ ఉమాశంకర్ దృష్టికి తీసుకువెళ్ళి ఫోన్‌లో మాట్లాడారు. నాలా నిర్మాణ పనులను ఎందుకు నిలిపివేశారంటూ ప్రశ్నించారు. అసంపూర్తిగా ఉన్న నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని ఆ అధికారిని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... లక్షలాదిరూపాయలు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనులకు ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలన్నారు. పనులు ప్రారంభించాక అర్ధాంతరంగా పనులు నిలిపివేయడంతో బస్తీలోనికి రాకపోకలు సాగించే స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావడం పట్ల అధికారుల, పాలకులపై విమర్శలు వస్తాయని సూచించారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా అభివృద్ధి పనులు చేపట్టే ముందు వాటికి సంబంధించిన అడ్డంకులు తొలగించి రూట్ మ్యాప్ ప్రణాళిక రూపొందించి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, మురళితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఊడిన ఆటో వీల్... తప్పిన ప్రమాదం

- ఆటోలో డ్రైవర్‌తో పాటు నలుగురు ప్రయాణికులు



వీల్ ఊడిపోయి రోడ్డు మీద నిలిచిన ఆటో

రెజిమెంటల్ బజార్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆటోలకు సరైన పత్రాలు, ఫిట్‌నెస్ లేకుండానే లోకల్‌గా తిప్పడం పరిపాటిగా మారింది. మంగళవారం ప్రయాణీకులతో వెళ్తున్న ఆటో వీల్ ఊడిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సికింద్రాబాద్ సంగీత్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ వైపు వేగంగా వస్తున్న ఆటో మదర్‌థెరిసా విగ్రహం వద్ద రాగానే ఆటో వెనుక చక్రం ఊడిపోయి, ముందుకు వెళ్లగా ఆటో రోడ్డుకు రాసుకుంటు నడి రోడ్డు మీద నిలిచిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో వెనుక వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ హఠాత్పరిణామానికి ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులు ఆందోళన చెందారు. ఆర్టీఏ అధికారులు ఆటోల ఫిట్‌నెస్‌పై దృష్టిసారించవలసిన అవశ్యకత ఈ సంఘటన గుర్తుచేస్తుంది. ట్రాఫిక్ పోలీసులు ఆటో అడ్డాల వద్ద షేరింగ్ ఆటోలపై దృష్టిసారించి డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు, లైసెన్స్‌ఫిట్‌నెస్ పత్రాలను తనిఖీలు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు.



గాంధీ మెడికల్ కాలేజీని సందర్శించిన వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినాచోంగూ

గాంధీ మెడికల్ కాలేజీలో హాస్టళ్లు, భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన

అడ్డగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గాంధీ మెడికల్ కాలేజీని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినాచోంగూ మంగళవారం సందర్శించారు. మెడికల్ కాలేజీలో ఉన్న సౌకర్యాలు, సమస్యలపై కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తాజాగా జాతీయ మెడికల్ కౌన్సిల్ 75శాతం మంది విద్యార్థులకు తప్పనిసరిగా హాస్టల్ సౌకర్యం కల్పించాలని కొత్త నిబంధన విధించిందని, ఈమేరకు గాంధీ మెడికల్ కాలేజీలో కొత్త హాస్టళ్లు, భవనాల నిర్మాణానికి స్థలం ఉందాలేదా పరిశీలించడం జరిగింది. కొద్ది రోజుల క్రితం గాంధీ మెడికల్ కాలేజీలో హాస్టల్‌వసతి సరిపోవడంలేదని వైద్య విద్యార్థులు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు యాభై శాతం మంది విద్యార్థులకు మాత్రమే తాము హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. నూతన భవనాలు నిర్మిస్తే మరో 30శాతం విద్యార్థులకు వసతి కల్పించే అవకాశం ఉందని భావించారు. ఆమె వెంట డీఎంఈ డాక్టర్ వాణి, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ కృష్ణ మోహన్, టీజీఎస్ఎంఎస్ఐడీసీ సీఈ దేవేందర్‌కుమార్, ఎస్ఈ సురేందర్‌రెడ్డి, ఈఈ చలపతి రావు, డిప్యూటీ ఈఈ అనిల్‌కుమార్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావులు పాల్గొన్నారు.



ఇటీవల రక్షించిన చిన్నారులను చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగిస్తున్న సీపీ తరుణ్ జోషి

చిన్నారుల కొనుగోలు కేసు పూణెలో మరో ఐదుగురి అరెస్ట్

- మరో ముగ్గురు చిన్నారులను రక్షించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంచలనం సృష్టించిన చిన్నారుల కొనుగోలు కేసులో రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మరో ముగ్గురు చిన్నారులను రక్షించినట్లు సీపీ తరుణ్‌జోషి మంగళవారం తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అయి విక్రయించబడిన 15 మంది చిన్నారులను ఇటీవల రాచకొండ పోలీసులు రక్షించి, నిందితుల ముఠాను కటకటాల్లోకి నెట్టిన విషయం తెలిసిందే. రక్షించిన చిన్నారులను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఇప్పటి వరకు మొత్తం రాచకొండ పోలీసులు రక్షించిన చిన్నారుల సంఖ్య 18కి చేరిందని సీపీ తెలిపారు. చిన్నారులను అక్రమ రవాణా చేయడంలో పూణె, ఢిల్లీ ముఠాల హస్తం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారికోసం గాలిస్తున్నారు. పూణె పోలీసులు చిన్నారుల కొనుగోలు కేసులో 9 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిసింది. వీరికి నగరంలో దొరికిన ముఠాలతో లింకులపై రాచకొండ పోలీసులు ఆరాతీయగా.. ఐదుగురు నిందితులకు సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో వారిని పీటీ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చి విచారించి ఢిల్లీ ముఠాలతో ఉన్న లింకులపై సమాచారం రాబడతామని సీపీ తెలిపారు. త్వరలోనే ఢిల్లీ ముఠాలను గుర్తిస్తామన్నారు. ముఠాల గుట్టు వీడితే ఆ చిన్నారులను ఎక్కడ తెచ్చారు..? వారి తల్లిదండ్రులు ఎవరు..? అనేది తేలాల్సిన అవసరం ఉందని, అందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

- ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్ బోర్డు 4వ వార్డు పరిధిలోని పికెట్ సుబ్బారావు కాలనీలో ప్రభుత్వ నిధులతో మంజూరైన పవర్‌బోర్‌వెల్ సనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. అంతకుముందు పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మారేడుపల్లి తహసీల్దార్ పద్మసుందరి, ఆర్ఐ మల్లేశ్వర్‌రెడ్డిలు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధి కరుణాకర్, నాయకులు ఎస్.వెంకటేష్, వినోద్, సంజీవ్, బద్రీనాథ్ యాదవ్, అశోక్, శ్రావణ్, సత్యనారాయణ, రేపాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పవర్ బోర్‌వెల్ పనులను ప్రాంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

రెవెన్యూ అధికారులతో సమీక్ష

కంటోన్మెంట్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.... అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. మహిళా సాధికారిక భవనాలు కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రతి వార్డులో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్ల కోసం ప్రభుత్వ స్థలాలు గుర్తించి వాటికి కేటాయించాలని, అర్హులైన లబ్దిదారులకు రెండు పడకల గదులను కేటాయించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరైన మార్గంలో మీ యొక్క విధులు నిర్వహించాలని ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో తిరుమలగిరి ఎమ్మార్వో అశోక్, డీటీ పృధ్వి, మారేడ్‌పల్లి ఎమ్మార్వో పద్మసుందరి, ఆర్ఐ మల్లేష్, సికింద్రాబాద్ ఎమ్మార్వో పాండునాయక్ పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న లష్కర్ జిల్లా సాధన కమిటీ సభ్యులు

లష్కర్ జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలి

- లష్కర్ జిల్లా సాధన కమిటీ సభ్యులు

బౌద్ధనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): లష్కర్ జిల్లాకు ఏర్పాటుకు కృషి చేయాలని లష్కర్ జిల్లా సాధన కమిటీ సభ్యులు రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కోరారు. మంగళవారం లష్కర్ జిల్లా సాధన కమిటీ సభ్యుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. లష్కర్ జిల్లా ఏర్పాటుకు బీజేపీ మద్దతు కోరామని, పెరిగిన జనాభా దామాషా ప్రకారం జిల్లా ఆవశ్యకత ఎంతైనా ఉందని, పార్టీలో చర్చించి తగువిధంగా నిర్ణయం తీసుకుంటామని లక్ష్మణ్ హామీ ఇచ్చారని పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బాలరాజ్‌యాదవ్, బాబురావు, సునీల్‌ముదిరాజ్, మిట్టపల్లి జగ్గయ్య, జగదీష్‌గౌడ్, కృష్ణముదిరాజ్, రవీందర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



యోగా వాక్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

- అవగాహన వాక్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ

ఖైరతాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పూర్వీకులు మనకు అందించిన గొప్ప చారిత్రక సంపదైన యోగాను ప్రపంచానికి వరంలా ఇచ్చామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ రాష్ట్ర ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21న యోగా దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలలతో పాటు అన్ని చోట్లా నిర్వహించాలని పిలుపునిస్తూ మంగళవారం పీవీ నర్సింహారావు మార్గ్‌లో వాక్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలని, దినోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా సాధన వల్ల శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఆరోగ్యసమతుల్యత ఏర్పడుతుందన్నారు. ఆయుష్ విభాగం కమిషనర్ ప్రశాంతి, డైరెక్టర్ పాణి కిరణ్, హోమియోపతి, నేచురోపతి విద్యార్థులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదుపాయాలను పరిశీలిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పర్యవేక్షకురాలు రజిని

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

ముషీరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పర్యవేక్షకురాలు, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రజిని తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను రజిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, స్కూల్ సెక్రటరీ రతన్, పీఈటీ కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అడ్వకేట్ జనరల్ పూజలు

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు స్వాగతం పలికారు.



హనుమాన్ ఆలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కెఆర్‌కె.ప్రసాద్, శ్రీనివాస్ యాదవ్, భక్తులు

హనుమాన్ ఆలయంలో షట్టర్ వేలంను నిలిపివేయాలి

- అభివృద్ధి కమిటీ సభ్యుల ఆందోళన
- ఈవోకు వినతిపత్రం అందజేత

కవాడిగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ దోమలగూడ హనుమాన్ దేవాలయంలోఉన్న ఖాళీషట్టర్ (మడిగ) వేలంపాట ద్వారా అద్దెకు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం దేవాలయం ఎదుట భక్తులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దాదాపు యాభై మంది భక్తులు ఆలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. దేవాలయంలో మడిగ వద్దు, విశాలంగా ఆలయాన్ని మార్చాలని, అధికారుల నిరంకుశవైఖరి విడనాడాలని వారు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం దేవాలయ ఈవో దేవానాథంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దోమలగూడ హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కెఆర్‌కె.ప్రసాద్, సలంద్రిశీనివాస్‌యాదవ్, కె.లక్ష్మీనారాయణ, వీడీ.కృష్ణ, బి.శ్యామ్‌లాల్, జె.పరమేశ్వర్‌లు మాట్లాడుతూ దేవాలయంలో ఉన్న మడిగను అద్దెకు ఇవ్వకుండా దానిని పూర్తిగా తొలగించి భక్తుల సౌకర్యార్థం గుడిని విశాలంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 24వ తేదీన దేవాలయంలో ఖాళీగా ఉన్న మడిగను అద్దెకు ఇస్తామని ఇచ్చే నోటీసులను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని దేవాదాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకుని దేవాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై దేవాదాయ శాఖ అధికారులు మొండిగా వ్యవహరిస్తే పెద్దఎత్తున ఆందోళన చేయడంతోపాటు కరసేవకు కూడా వెనకాడబోమని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి గుడిని భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. ఈవిషయంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తామని వారు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు ఇటి సురేష్‌కుమార్, జి.వెంకటేష్, సలంద్రి దిలీప్‌యాదవ్, జంగాశ్రీనివాస్, కుమార్‌గౌడ్, వెంకటరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364